
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



సోమశిలలో 52.656 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 52.656 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,100 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, పెన్నార్ డెల్టాకు 2 వేలు, ఉత్తరకాలువకు 540, దక్షిణ కాలువకు 8,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,060
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,025
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,236
నవర (8 గ్రాములు)	రూ.57,888

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.7 /25.7

జిల్లాలో శుక్రవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గురువారం గాలిలో తేమ 78 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఐసెట్ స్పాట్ అడ్మిషన్స్‌కు గడువు పెంపు

వెంకటాచలం: వీఎస్‌యూలో ఐసెట్ రాసిన వారికి స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పెంచినట్లు వీఎస్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసెట్ 2024లో క్వాలిఫైడ్ అభ్యర్థులు మాత్రమే అర్హులని, వివరాలకు 94415 99597, 99893 53455 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వీఆర్‌కు కొండాపురం ఎస్సై

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: కొండాపురం ఎస్సై మహేంద్రను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఆదేశాలు జారీచేశారు. కొండాపురం మండలంలో ఇసుక అక్రమణ రవాణాలో ఎస్సై మహేంద్ర పాత్ర, సర్కిల్ పోలీసులకు, కొండాపురం పోలీసులకు మధ్య తలెత్తిన విభేదాలపై ఈ నెల 4న సాక్షిలో 'అడిగినంత ఇస్తే.. ఓకే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎస్పీ స్పందించారు. విచారణ నివేదిక తెప్పించుకుని ఎస్సైను వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు వేదాయపాళెంలో విధులు నిర్వహిస్తున్న ఎం. వెంకట్రావును నియమించారు. ఆయన గురువారం విధుల్లో చేరారు. ఎస్సై మహేంద్ర, సీఐ వెంకటనారాయణకు మధ్య విభేదాలు ఉన్నాయి. తనకు అత్యంత సన్నిహితుడైన వెంకట్రావును కొండాపురం ఎస్సైగా వేయించుకోవడంలో సీఐ పాత్ర ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు వేదాయపాళెం స్టేషన్ కలిసి పని చేశారు.

బియ్యం కన్నా.. ఇసుకే ఖరీదు

- నేతి బీరకాయ చందం ఉచిత ఇసుక
- భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులు
- ఇసుక దోపిడీ ఆపి ఉచితంగా ఇవ్వకపోతే పోరాటం ఉధృతం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- 20 మందిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు



కరెంటాఫీస్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (బారకాసు): జిల్లాలో బియ్యం కంటే.. ఇసుక ధరే ఎక్కువగా ఉందని, భవిష్యత్‌లో ఇసుక ప్యాకెట్స్ రూపంలో కొనే దుస్థితి రాబోతుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని స్థానిక కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణ కార్మికులకు సంఘీభావం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇసుకను ఉచితంగా ఇవ్వాలని నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాకాణి మాట్లాడుతూ కేజీ రేషన్ బియ్యం రూ.1 అయితే.. ఇసుక రూ.2 కంటే ఎక్కువ ఉందన్నారు. ఉచిత ఇసుక పాలసీ విధానంలో చంద్రబాబు మాటలు నేతి బీరకాయ చందంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ టీడీపీ నేతలు అక్రమ రవాణా చేస్తున్నారని, ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ప్రేక్ష పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. ఇసుక తవ్వకాలతో సంగం బ్యారేజీ భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఉచిత ఇసుకపై కలెక్టర్ చెబుతున్న మాటల్లో ఎక్కడా నిజం కనిపించడం లేదన్నారు. తాము కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాలన్న నిర్ణయాన్ని విరమించుకున్నామన్నారు. కలెక్టర్ కార్యాలయం టీడీపీ ఆఫీసుగా మారిందన్నారు. ప్రజలు కష్టాలు అధికారులు పటించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు అక్రమ రవాణా నిలిపివేసి, ఉచిత ఇసుక ఇవ్వకపోతే ప్రజల పక్షాన నిలబడి తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని కాకాణి హెచ్చరించారు. పార్టీ రూరల్ నియోజక వర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేయడం లేదని, కేవలం అధికార పార్టీ నేతలు తమ జేబులు నింపుకుంటున్నారన్నారు. ఇసుక కొరతను సృష్టించి అధిక రేటుకు అమ్ముకుంటున్నారని, భవన నిర్మాణాలు ఆగిపోయాయని, వేలాది మంది కార్మికులకు పనులు లేక నాలుగు నెలలుగా పస్తులతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక అంటూ ప్రజలకు నెత్తిమీద టోపీ వేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. కాగా అనుమతి లేకుండా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన 20 మందిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

పీఎంశ్రీ పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ



జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్న ట్యాబ్‌లు

నెల్లూరు (టౌన్): జిల్లాలో పీఎంశ్రీకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లకు ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి 690 ట్యాబ్‌లు చేరుకున్నాయి. విద్యార్థి వ్యక్తిగత అనుకూల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందే దిశగా ఈ ట్యాబ్‌లను అందజేయనున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు తమ అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించుకునేలా ప్రత్యేక కార్యాచరణను చేపట్టనున్నారు.

టెట్‌కు 139 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): జిల్లాలో గురువారం నిర్వహించిన టెట్‌కు 139 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 595 మందికి 537 మంది హాజరు కాగా 58 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 596 మందికి 515 మంది హాజరు కాగా, 81 మంది గైర్హాజరయ్యారు.



మల్లికార్జునరావును పరామర్శిస్తున్న కాకాణి, రామిరెడ్డి, పర్వతరెడ్డి

- మల్లికార్జునరావును పరామర్శించిన పార్టీ నేతలు కాకాణి, రామిరెడ్డి, పర్వతరెడ్డి

భవిష్యత్‌లో ప్రతి దాడులు తప్పవు

నెల్లూరు (బారకాసు): ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కావలిలో టీడీపీ నేతల ముసుగు దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామిశెట్టి సుధీర్‌నాయుడు చిన్నాన్న మల్లికార్జునరావు నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన్ను గురువారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి కాకాణి పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఈ విధమైన దాడులు కొనసాగిస్తే.. భవిష్యత్‌లో ప్రతిదాడులకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారిపై దాడులకు పాల్పడడం సరికాదన్నారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలు తిరగబడితే టీడీపీ నేతల పరిస్థితి ఏమిటో ఊహించుకోవాలని చెప్పారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సౌమ్యుడు మల్లికార్జునరావుపై టీడీపీ నేతలు దాడి చేయడం సిగ్గు చేటన్నారు. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే కూటమి పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోక తప్పదన్నారు.

క్లుప్తంగా

భైరవకోనలో సినీ నటుడు శ్రీకాంత్ పూజలు



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సీతారామపురం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భైరవకోనను గురువారం సినీ నటుడు శ్రీకాంత్ సందర్శించారు. తొలుత త్రిముఖ దుర్గాంబికా దేవి అమ్మవారు, శివయ్యను, భైరవేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌ను సన్మానించారు.

పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కావలి: మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ టి.శ్రీనివాసరావు అన్నారు. కావలిలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 182 మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఈనెల 14వ తేదీన కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ ద్వారా షాపులు ఖరారు చేస్తామని వెల్లడించారు. ఆన్‌లైన్‌పై అవగాహన లేని వారు సమీపంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శిస్తే దరఖాస్తు చేసే ప్రక్రియను పూర్తి చేసేలా సహకరిస్తారన్నారు. మద్యం వ్యాపారం చేయాలని ఆసక్తి ఉన్న వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



ఇసుక ట్రాక్టర్ల వద్ద పోలీసులు

చేజర్ల: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సంగం సీఐ వేమారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఉలవపల్లి దగ్గర ఉన్న పెన్నానది నుంచి గురువారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను చేజర్ల ఎస్సై ప్రభాకర్, సిబ్బంది పట్టుకున్నారు. వాటిని చేజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయా వాహనాల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

యజమాని వేధింపులు భరించలేక..

- తప్పించుకున్న చిన్నారులు
- ఆశ్రయమిచ్చి ఆదుకున్న స్థానికులు



గిరిజన చిన్నారులు

సంగం: సంగం కావలి కాలువ సమీపంలో ఉన్న ఓ బాతుల యజమాని వేధింపులు భరించలేక ఇద్దరు గిరిజన చిన్నారులు బుధవారం అర్ధరాత్రి తప్పించుకెళ్లారు. సంగం జంగాలకండ్రిక సమీపంలో కావలికాలువ కట్టపై వర్షంలో నడుచుకుంటూ బిక్కుబిక్కుమంటూ వెళ్తున్న వారిని స్థానికులు గుర్తించి గ్రామ సర్పంచ్ సునీల్ వద్దకు తీసుకెళ్లారు. సునీల్ చిన్నారులతో మాట్లాడి ధైర్యం చెప్పి వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా వారు వివరాలు వెల్లడించారు. పోలీసులు గురువారం బాతుల యజమానిని పిలిపించి మాట్లాడి చిన్నారుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సమన్వయకర్తలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కాకాణి ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సమన్వయకర్తలతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్‌లో ఏ విధంగా పోరాటలకు సన్నద్ధం కావాలనే అంశాలపై చర్చించారు. నాయకులు, కార్యకర్తలకు అధికార పార్టీ నుంచి ఇబ్బందులు ఎదురైతే అండగా నిలబడి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో నెల్లూరు సిటీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి, ఆత్మకూరు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, సూళ్లూరుపేట సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కావలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, గూడూరు సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, కందుకూరు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు వచ్చి కానరాని లోకాలకు..

- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి
- రేవూరులో విషాదం



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి



నవీన్ (ఫైల్)

సోమశిల: ఐదు సంవత్సరాల క్రితం ఇంటి పెద్ద చనిపోయాడు. ఆ బాధ నుంచి కుటుంబం కోలుకుని ముందుకెళ్తోంది. ఈ సమయంలో ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి వేదనతో తల్లడిల్లుతోంది. విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి అనంతసాగరం మండల పరిధిలోని రేవూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ధనమ్మ, గురవయ్య దంపతులకు కుమారుడు నవీన్ (24), కుమార్తె సంతానం. గురవయ్య ఐదేళ్ల క్రితం చనిపోయాడు. తల్లి నవీన్‌ను చదివించింది. అతను కుటుంబ పోషణ నిమిత్తం బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శరన్నవరాత్రి ఉత్సవాలను చూసేందుకు నవీన్ గ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి అమ్మవారి మండపం వద్ద విద్యుత్ తగిలి షాక్‌కు గురై పడిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. కుమారుడి మృతితో ధనమ్మ కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. గురువారం నవీన్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆగని టీడీపీ నాయకుడి ఆగడాలు

- వైఎస్సార్‌సీపీ నేత, కుటుంబంపై మళ్లీ దాడికి యత్నం



రవికుమార్‌రెడ్డి నివాసం వద్ద టీడీపీ నేత మధు

సోమశిల: అనంతసాగరం మండలం శంకరనగరం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, అతని కుటుంబంపై టీడీపీ నాయకుడు మళ్లీ దాడికి యత్నించాడు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం గ్రామానికి వచ్చి రవికుమార్‌రెడ్డిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని చెప్పారు. కాగా గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బొల్లినేని మధు రవికుమార్‌రెడ్డి, అతని కుటుంబంపై దాడి చేసేందుకు వారి ఇంటి వద్దకు వచ్చాడు. కుటుంబసభ్యులు గమనించి తలుపులు మూసివేయడంతో మధు రోకలితో దానిని కొడుతూ నానా దుర్భాషలాడాడు. తీవ్ర భయాందోళనకు గురైన మహిళలు ఆత్మకూరు సీఐ గంగాధర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ఆయన సిబ్బందిని పంపి మధును అదుపులోకి తీసుకున్నారు. మూడు నెలల క్రితం జరిగిన దాడితో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మళ్లీ గ్రామానికి వచ్చిన తమను భయపెట్టడం తగదని రవికుమార్‌రెడ్డి కుటుంబం చెబుతోంది. మధుపై అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

8 సవర్ల బంగారం చోరీ

కావలి: పట్టణంలోని జనతాపేటలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. విజయనగరం జిల్లాకు చెందిన వెంకటరమణ కావలిలో రైల్వే గేట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని కుటుంబం రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటోంది. బుధవారం రాత్రి వారంతా ఇంటి ఆరుబయట నిద్రించారు. తలుపులకు తాళం వేయలేదు. దొంగ ఇంట్లోకి ప్రవేశించి బీరువాను తెరిచి 8 సవర్ల బంగారం, రూ.2 వేలు నగదు చోరీ చేశాడు. గురువారం ఉదయం చూసిన బాధితుడు కావలి టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- కాగా బీరువా వద్ద వేలిముద్రలు కూడా సేకరించలేదని, పోలీసులు కేసు విచారణ విషయంలో సీరియస్‌గా లేరని రైల్వే ఉద్యోగ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

వెంకటాచలం: పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసిన ఘటన మండలంలోని కసుమూరు, పూడిపర్తి గ్రామాల్లో గురువారం జరిగింది. వివరాలు.. కసుమూరు పంచాయతీ పరిధిలోని తిప్ప సమీపంలో కొందరు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.12,740 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పూడిపర్తిలో ఎనిమిది మందిని పట్టుకుని రూ.1,120 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఏఆర్ అడిషనల్ ఎస్పీ బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.శ్రీనివాసరావు గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా గురువారం బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా ఏఆర్ డీఎస్పీ జి.మునిరాజా ఏఎస్పీగా పదోన్నతి పొంది నెల్లూరు ఏఆర్ ఏఎస్పీగా నియమితులైయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



గాయపడిన చంద్రశేఖర్



ఘటనా స్థలంలో గాయపడిన వ్యక్తి



చిన్నారి ఏసుబాబు

కలిగిరి: మండలంలోని పోలంపాడు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తితోపాటు ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సంగం మండలం కొరిమెర్లకు చెందిన ఓ వ్యక్తి ఇద్దరు చిన్నారులను మోటార్‌బైక్‌పై ఎక్కించుకుని కలిగిరి మీదుగా కావలి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలంపాడు వద్ద హైవే నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉంచిన కంకర గుట్టను చీకట్లో గమనించక బైక్‌ను ఎక్కించడంతో అదుపుతప్పి పడిపోయారు. బైక్ కొంత దూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది వారిని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చిన్నారులు తమ పేర్లను చంద్రశేఖర్, ఏసుబాబుగా చెప్పారు.గాయపడిన వ్యక్తి వివరాలు, పూర్తి సమాచారం పిల్లలు చెప్పలేక పోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభం

నెల్లూరు రూరల్: జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభించామని డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 229 టవర్లు 4జీ సేవలకు సిద్ధం చేశామన్నారు. అందులో 145 టవర్ల ద్వారా ఇప్పటికే సేవలు అందిస్తున్నామన్నారు. నవంబర్ నెలాఖరున మిగతా వాటిని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 2.60 లక్షల మంది వినియోగదారులున్నారని, వీరిలో 35 వేల మంది ఇంకా 4జీ సిమ్ తీసుకోలేదన్నారు. దగ్గర్లోని కస్టమర్ సర్వీస్‌లో లేదా సిమ్ కార్డు విక్రేతల దగ్గర మార్చుకోవాలని సూచించారు.

14న పీఎం అప్రెంటీస్ మేళా

నెల్లూరు(టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 14న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో దొడ్ల డెయిరీ, గోకుల్ ఆగ్రో, ఏపీపీడీసీఎల్, తారకేశ్వర టెక్స్‌టైల్స్, భార్గవి ఆటోమొబైల్స్, గ్రీన్ లేస్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలు పాల్గొనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఐటీఐలో ఉదయం 10 గంటల నుంచి జరిగే మేళాకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

ఎన్ని దరఖాస్తులు వస్తాయో..!

- నేటితో 'మద్యం' దరఖాస్తుల స్వీకరణ గడువు ముగింపు
- గురువారం సాయంత్రానికి 2,807 దాఖలు

నెల్లూరు(క్రైమ్): మద్యం షాపుల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు ముగియనుంది. చివరిరోజున పెద్దఎత్తున అప్లికేషన్లు వేసేందుకు ఆశావహులు, కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల ఒకటో తేదీన జిల్లాలో 182 మద్యం దుకాణాలకు కలెక్టర్ ఆనంద్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అదేరోజు నుంచి జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లైసెన్స్, ఫీజుల పెంపు, కూటమి నేతల బెదిరింపులు తదితరాలతో ఐదు రోజులపాటు నామమాత్రంగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అధికారుల్లో అలజడి మొదలైంది. డీసీ నేతృత్వంలో అధికారులు గతంలో వ్యాపారాలు చేసిన వారు, ఆశావహులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2,807 దరఖాస్తులు వచ్చాయి.

ఎన్నంటే..

నెల్లూరు నగరంలోని 30 షాపులకు 557, నెల్లూరు రూరల్‌లోని మూడు షాపులకు 72, వి.సత్రం పరిధిలోని ఆరు షాపులకు 78, మనుబోలు మండలంలో మూడు షాపులకు 54, కావలి మున్సిపాలిటీలో ఆరు షాపులకు 55, కావలి రూరల్‌లోని నాలుగు షాపులకు 48, జలదంకిలో మూడు షాపులకు 40, బోగోలులో నాలుగు షాపులకు 51, అల్లూరు నగర పంచాయతీలో నాలుగు షాపులకు 17, రూరల్లో రెండు షాపులకు 15, కోవూరులో ఆరు షాపులకు 50, కొడవలూరులో ఐదు షాపులకు 82, విడవలూరులోని నాలుగు షాపులకు 54, బుచ్చి నగర పంచాయతీలోని ఆరు షాపులకు 80, రూరల్లో మూడు షాపులకు 34, దగదర్తిలోని రెండు షాపులకు 41, సంగంలోని మూడు షాపులకు 65, ఉదయగిరి మూడు షాపులకు 23, దుత్తలూరులోని రెండు షాపులకు 41, మర్రిపాడులోని ఐదు షాపులకు 43, ఎస్ఆర్‌పురంలోని రెండు షాపులకు 17, వింజమూరులోని మూడు షాపులకు 71, కలిగిరిలోని మూడు షాపులకు 64, వరికుంటపాడులోని రెండు షాపులకు 22, కొండాపురంలోని మూడు షాపులకు 18, ఇందుకూరుపేటలోని ఐదు షాపులకు 99, తోటపల్లిగూడూరులోని ఐదు షాపులకు 94, ముత్తుకూరులోని 8 షాపులకు 100, ఆత్మకూరు మున్సిపాలిటీలోని నాలుగుషాపులకు 68, రూరల్‌లోని రెండు షాపులకు 11, ఎఎస్‌పేటలోని రెండు షాపులకు 45, కలువాయిలోని రెండు షాపులకు 53, అనంతసాగరంలోని మూడు షాపులకు 70, పొదలకూరులోని ఆరు షాపులకు 57, చేజర్లలోని మూడు షాపులకు 89, రాపూరులోని నాలుగు షాపులకు 61, సైదాపురంలోని నాలుగు షాపులకు 113, కందుకూరులోని నాలుగు షాపులకు 59, రూరల్లో ఒక షాపునకు 14, ఉలవపాడులోని నాలుగు షాపులకు 28, లింగసముద్రంలోని రెండు షాపులకు 67, గుడ్లూరులోని మూడు షాపులకు 63, వలేటివారిపాళెం మండలంలోని మూడు షాపులకు 24 దరఖాస్తులు దాఖలయ్యాయి.

- గరిష్టంగా నెల్లూరు నగరంలోని 30 షాపులకు 557 దరఖాస్తులు దాఖలు కాగా కనిష్టంగా అల్లూరు నగర పంచాయితీలోని నాలుగు షాపులకు 17 దరఖాస్తులు దాఖలయ్యాయి. అత్యధికంగా లింగసముద్రంలోని 175 నంబర్ షాపునకు 34, 176 నంబర్ షాపునకు 33, చేజర్ల మండలంలోని 155 షాపునకు 33, సైదాపురంలోని 164 షాపునకు 31 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు పోటెత్తె అవకాశం ఉండడంతో ఎక్సైజ్ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఏడుగంటల్లోపు క్యూలో ఉన్న వారందరి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు తెలిపారు.

వైద్యుడిని బెదిరించి నగదు డిమాండ్

- మాజీ హోంగార్డుపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ వైద్యుడిని బెదిరించడమే కాకుండా నగదు డిమాండ్ చేసిన మాజీ హోంగార్డుపై నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అంబాపురానికి చెందిన రిజాయ్ గతంలో పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేశాడు. ఆ సమయంలోనే ఒంటరిగా వెళ్లేవారిని, దంపతులను బెదిరించి నగదు వసూళ్లకు పాల్పడసాగాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారులు అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. అయినా ప్రవర్తనలో మార్పు రాలేదు. ధనలక్ష్మీపురానికి చెందిన వైద్యుడు విశ్వనాథ్‌కు పొగతోటలో క్లినిక్ ఉంది. ఆయన ఈనెల 8వ తేదీ రాత్రి అతను పని ముగించుకుని మోటార్‌బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. అపోలో జంక్షన్ వద్ద విశ్వనాథ్‌ను రియాజ్ అడ్డగించాడు. ఈ సమయంలో ఎక్కడి నుంచి వస్తున్నావు? నేను సీఐ ఐడీ పార్టీనంటూ బెదిరించి బైక్ తాళం లాక్కోవడమే కాకుండా రూ.20 వేలు డిమాండ్ చేశాడు. విశ్వనాథ్ తాను ఏం తప్పు చేశానని?, నీకు డబ్బులు ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నించాడు. రియాజ్‌ను, అతని బైక్‌ను సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. దీంతో నిందితుడు తాళాలు ఇచ్చేసి ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
లేయర్ చికెన్	: 195

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.80
సన్నవి :	రూ.40
పండ్లు :	రూ.30

